## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-01-2008, మలికిపురం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన భారతదేశంలో జన్మించిన ముఖ్యమైన సిద్ధపురుషులలో షిరిడీసాయిబాబా ఒకరు. ఆయన తల్లితండ్రులు ఎవరో, ఆయన ఎక్కడ జన్మించాడో, ఆయన ఏ మతస్థుడో ఎవరికీ తెలియదు. ఆయనకు మతభేదం లేదు, కులభేదం లేదు, ప్రాంతీయ భేదం లేదు. భారతదేశం చాలా విశాలమైన దేశం. మన హృదయం అంత విశాలంగా ఉంటేనేగాని దేశాన్ని మనం ప్రేమించలేము. ముందు దైవభక్తి తరువాత దేశభక్తి ఈ రెండూ మనం మర్చిపోకూడదు. భగవంతుడు మనకు కేటాయించిన పనిని ఈశ్వరార్పణబుద్ధితో చేసుకొంటూ, మన దేహాన్ని, మనస్సును, ఇంద్రియాలను సర్వేశ్వరుడికి అర్పించి జీవిస్తూ ఉంటే మనకు మోక్షం వస్తుంది అంటే ఈశ్వరుడి స్వరూపాన్ని పొందుతాము. మేము ఎంత సుఖాన్ని అనుభవిస్తున్నా భగవంతుడి నామం మీద ప్రీతి పోవటంలేదు. మాకు బాహ్యంగా కోరుకోదగ్గ వస్తువులు లేవు, పొందదగిన వస్తువులు లేవు అయినప్పటికీ భగవంతుడి నామం మీద ఇష్టం పోవటం లేదు, మాది అకారణభక్తి అని కొంతమంది భక్తులు అంటారు. అది తెలిసినవారికి నామంలో అంతరుచి ఉంది. భగవంతుడు నిత్యకర్మయోగి. మనం అజాగ్రత్తగా ఉన్నా భగవంతుడు జాగ్రత్తగా ఉంటాడు. మనం నిద్రపోతున్నా మన నిద్రను చూస్తూ ఉంటాడు. భగవంతుడికి రూపంలేదు, నామంలేదు. మన నామరూపముల నుండి మనలను విడుదల చేయటంకోసం ఆయన ఒక రూపం ధరించి, పేరుపెట్టుకొని వస్తాడు. భగవంతుడి యొక్క కళ్యాణగుణాలు, ఆయన వైభవం మీకు తెలిస్తేగాని మీరు ప్రయత్నం చేసినా భక్తి కలుగదు అన్నాడు శ్రీకృష్ణచైతన్య.

ఆచార్యులవారు మూడు ఆత్మల గురించి చెప్పారు. గౌణాత్మ, మిధ్యాత్మ, సత్యాత్మ. గౌణం అంటే ఏమీ ప్రాధాన్యంలేని విషయం. గౌణాత్మ అంటే ఇంట్లో మీ మనవలకు జ్వరం వస్తే మనకే వచ్చేసింది అనుకొంటాము. నువ్వు డ్యూటీ చెయ్యాలికాని నాకే వచ్చేసింది అని దుఃఖపడుతూ ఉంటే నీకు దేహాభిమానం పెరిగిపోతుంది, నువ్వు సాధనకు పనికిరావు. అసలు మీరు భక్తికే పనికిరారు, బజారులో భక్తులని పిలువబడుతున్నారు. జ్ఞానం గురించి ఏడవటం మానేసి, మీ మనవడి గురించి ఏడుస్తారా, మీరు భక్తులా అన్నారు ఆచార్యులవారు. దేహము నేను అనే తలంపునే మిధ్యాత్మ అంటారు. మీకు ఎంత డబ్బు ఉన్నా, అధికారం ఉన్నా దేహము నేను అనే తలంపు ఉన్నంతకాలం జననమరణ ప్రవాహంలో నుండి బయటకు రాలేరు. నువ్వు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానంలో నుండి బయటకురావాలి లేకపోతే ప్రయోజనం లేదు. మిధ్యానేను ఎక్కడ నుండి అయితే ఉదయించి వస్తోందో విచారణామార్గం ద్వారా దానిని అక్కడకు ప్రవేశపెట్టినా సరే లేకపోతే ఈశ్వరుడి పట్ల భక్తి వలన నీ మనస్సును హృదయంలో

ముంచినాసరే ఇలా ఏదో మార్గం ద్వారా నీ మనస్సును హృదయంలో నిలబెట్టి ఉంచితే అప్పుడు మనస్సు నశిస్తుంది, నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. సాధన చెయ్యటం వలన సిద్ధి వస్తుంది గాని పాండిత్యంవలన, ధనం వలన, రచనలు చెయ్యటంవలన ఏదో పదిమందికి ఉపయోగ పడవచ్చునుగాని హృదయంలో మునిగే శక్తి నీకు లేకపోతే కోటిజన్మలు ఎత్తినా నీకు జ్ఞానంరాదు. ఈ లోకంలో ఉన్న భోగాల గురించిగాని, పరలోకంలో ఉన్న భోగాల గురించిగాని ఎవడికి ఆసక్తి లేదో, కోరిక లేదో వాడి మనస్సు మటుకే హృదయంలో మునుగుతుంది. మిగతా వారికి ఇది సాధ్యం కాదు. సత్యాత్మ అంటే భగవంతుడు. ఇది అంతటా ఉంటుంది, అన్ని కాలాలలో ఉంటుంది. సత్యాత్మను తెలుసుకొనేవరకు నువ్వు పునర్జన్మలలో నుండి, సంసారంలో నుండి బయటకు రాలేవు. హృదయంలో ఉన్న సత్యాత్మ ఎవరికైతే ఎరుకలోనికి వచ్చిందో వాడు ఈ శరీరం ఉండగానే శరీరం లేనివాడితో సమానము, వాడు అమృతుడు అవుతాడు.

దేహభావన ఉన్నవాడిని, జీవలక్షణాలు ఉన్నవాడిని ఏ జన్మకు ఆజన్మ ప్రియము, అప్రియము విడిచిపెట్టవు. ఉపనిషత్‌లలో చెప్పినమాటలు, భగవద్గీతలో చెప్పిన మాటలు విన్నా మనం నమ్మము. ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు, జన్మాంతరంలో నుండి వచ్చిన వాసనలు మనలను నమ్మనివ్వవు. వారు 500 కోట్లు సంపాదించారు అని ఎవరైనా చెపుతూ ఉంటే ఆ మాటలు శ్రద్ధగా వింటాము. ఆ మాత్రం శ్రద్ధ కూడా భగవంతుడు చెప్పిన మాటలమీద ఉండదు. భగవద్గీతలో చెప్పిన మాటలు వింటే మీరు బాగుపడతారు. 500 కోట్లు సంపాదించిన వాడు దానిని వెయ్యికోట్లు ఎలా చెయ్యాలి అని చూస్తాడు కాని మీ క్షేమం వాడు చూడడు. కనీసం మీకు మంచినీళ్ళు కూడా ఇవ్వడు. వారి గురించి ఈ భక్తులు చెప్పకోవటం ఎందుచేతనంటే ధనం మీద ఉన్న అపేక్ష, ఆశ ఉండి ఇలా ఏడుస్తూ ఉంటారు. మీరు భగవంతుడి గురించి చెప్పకోవటం మానేసి వారి గురించి చెప్పకోవటం, పాడైపోవటం. మీరు భక్తులా అంటున్నారు ఆచార్యులవారు. ప్రియము అంటే కోరిక, ఎక్కడ ప్రియము ఉంటే మీ మనస్సు అక్కడకు పోతూఉంటుంది. మీ ఆయన అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, ఎందుకు ఇష్టం అంటే మిమ్మల్ని సుఖపెడుతున్నాడు కాబట్టి మీ ఆయన అంటే మీకు ఇష్టం, మిమ్మల్ని సుఖపెట్టటం మానేస్తాడు అనుకోండి, మీరు నెమ్మదిగా వాడికి మానసికంగా దూరమైపోతారు. వాడికి భార్య అంటే ఎందుకు ఇష్టం అంటే భార్య ద్వారా వాడు సుఖపడుతున్నాడు కాబట్టి భార్య అంటే ఇష్టం. వాడికోసం మీరు ఇష్టం, మీకోసం వాడు ఇష్టం, ఇదీ సంసారం అన్నారు ఆచార్యులవారు. అప్రియము అంటే క్రోధము, అప్రియము ఉన్నచోట కోపం ఉంటుంది. ప్రియము ఉన్నచోట కామం ఉంటుంది. దేహాత్మభావన ఉన్నవాడు కర్తృత్వం లేకుండా పని చేయలేడు అందుచేతవాడు పుణ్యానికి పుణ్యం, పాపానికి పాపం అనుభవించ వలసిందే. ఎవడైతే ఈ

శరీరం ఉండగానే సాధన చేసి అభ్యాస వైరాగ్యముల వలన కామక్రోధముల వేగాన్ని తగ్గించుకొన్నాడో వాడు మృత్యువును జయిస్తాడు. అంటే శరీరానికి మృత్యువు వచ్చినా తనకు మృత్యువు లేదనే అనుభవాన్ని పొందుతాడు. శరీరం ఉండగానే ఆ అనుభవాన్ని పొందినవాడు శరీరం ఉన్నప్పడు కూడా శరీరం లేనివాడితో సమానము.

భగవంతుడి దగ్గర ఉన్న జ్ఞానాన్ని, శాంతిని అడుగుతున్నాము కాని మనకు ఆయన మీద ప్రేమలేదు, ఇష్టంలేదు, భక్తిలేదు. మనం భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని జీవించాలి గాని ఎవరో అలా ఉన్నారు అని మనం కూడా అలాగ ఉండకూడదు. గురువు ముఖతః నేర్చుకొన్నది అధ్యయనం, మనంతట మనం చదువుకొంటే అదే చదువు. అధ్యయనం చేసినవాడికి వాక్కులో దోషం ఉండదు. అసలు శబ్దం ఉన్నది ఉన్నట్లుగా మనకు అర్థమవుతూ ఉంటే ఇలా కూర్చొన్న వాళ్ళు లేవకుండా జ్ఞానం వచ్చేస్తుంది. మనకు భక్తి ఉంటే ఆ మాట మన గుండెకు పడుతుంది. మనం ప్రజలను మోసం చేయగలము గాని భగవంతుడిని మోసం చేయలేము, ఎందుచేతనంటే ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. భగవంతుడు ఆడించేవాడు, మనం ఆడేవాళ్లము. ఈ శరీరం ఎప్పడు పోతుందో ఎవరూ చెప్పలేరు. ఆచార్యులవారు అన్నారు ఈ దేహంతోటి కాదు మూడు దేహాలలో దేనితో సంబంధం ఉన్నా జ్ఞానం రాదు అని చెప్పారు. 1. మాంసం, ఎముకలతో ఉన్నది స్థూలదేహం. 2. సూక్ష్మదేహం అంటే మనస్సు దీనిలో తలంపులు, కోరికలు అన్నీ ఉంటాయి. 3. ఈ స్థూల దేహానికి, సూక్ష్మ దేహానికి ఏదైతే కారణమో దానిని కారణదేహం అని అంటారు. అదే అజ్ఞానం. నీకు అజ్ఞానంతో తాదాత్మ్యం ఉన్నా, మనస్సుతో తాదాత్మ్యం ఉన్నా, స్థూలదేహంతో తాదాత్మ్యం ఉన్నా ఈ మూడు దేహాలలో ఒక్క దేహంతో తాదాత్మ్యం ఉంటే నీకు మోక్షం సున్నా అని ఆచార్యుల వారు చెప్పారు.

నేను 20 సం॥ల నుండి సాధన చేస్తున్నాను, ఆత్మ సత్యం, దేహం సత్యం కాదు అని అనుకొన్నా నా మనస్సు నిలబడటంలేదు, చివరకు దేహమే సత్యం అనిపిస్తోంది, నాకు ఏకాగ్రత రావటం లేదు అని ఒక భక్తుడు అడుగుతున్నాడు. నువ్వు ఆత్మ సత్యం అని నోటితో అనుకొంటున్నావు కాని నీ మనస్సును ఆత్మపై పెట్టటం లేదు. మనస్సు ఇంద్రియాల ద్వారా బయటకు వచ్చేస్తోంది. ఒక్కొక్కరికి ఒకో ఇంద్రియం ద్వారా మనస్సు బయటకు వచ్చేస్తుంది, అది ఒక బలహీనత. మనం ఎన్ని ప్రవచనాలు విన్నా టి.వి మీద ఉన్న శ్రద్ధ మనకు భగవంతుడిమీద లేదు మనకు లోచూపు కలుగుతూ ఉంటే మన మనస్సులో ఏ వికారాలు ఉన్నాయో మనకు తెలుస్తుంది. మనకు అసలు అంతఃకరణశుద్ధి చేసుకోవాలనే ప్రయత్నమే లేదు. ప్రార్థనతో, విచారణతో, ధ్యానంతో మన అంతఃకరణాన్నిశుద్ధి చేసుకోవాలి అనే బుద్ధి మనకు రావటం లేదు. దమము, దయ, దానము ఉండాలి. దమము అంటే ఇంద్రియనిగ్రహం, తోటి మానవుడిపట్ల

దయ కలిగి ఉండాలి, ఎంతో కొంత దానబుద్ధి ఉండాలి. దూదికి అగ్గిపుల్ల అంటించితే అది ఎలా భస్మమయిపోతుందో ఈశ్వరానుగ్రహం వస్తే నీ బుద్ధిలో ఉన్న దోషాలు, బలహీనతలు, పాపరాశి ఎంత ఉన్నా అంతా కూడా కాలి బూడిద అయిపోతుంది. కనిపించే వాడు గురువు, కనిపించని వాడు దేవుడు. గురువు నీకు భోదిస్తాడు, ఆచరించే ప్రోత్సాహం ఇస్తాడు, నీలోని బలహీనతలు బయటకు తీయటానికి ప్రయత్నిస్తాడు, గురువు యొక్క అనుగ్రహం లేకుండా జ్ఞానం రానేరాదు. అట్టి గురువు మీద నీకు విశ్వాసం లేనప్పడు, గౌరవం లేనప్పడు కనిపించని దేవుడి మీద నీకు గౌరవం, భక్తి ఎలా కలుగుతుంది. నీ అబద్ధపు మాటలు, నీ బూటకాలు ఎవరు నమ్ముతారు. భక్తి మార్గం, కర్మమార్గం, జ్ఞానమార్గం ఇలా ఏదో ఒక మార్గంలో ప్రయాణించి మనం దేహాభిమానంలో నుండి బయటకు రావాలి. మనం ఏదైనా ఒక నామం చేసేటప్పడు గౌరవంగా చేయాలి, గౌరవం లేకుండా నామం అనుకొంటే అది అపచారం, హృదయపూర్వకంగా మనస్సు అక్కడపెట్టి నామం చేసుకోవాలి. భగవంతుడి నామాన్ని మీరు ప్రేమగా, ప్రీతిగా చేస్తూ ఉంటే, ఆ నామం గలవాడికి నామానికి భేదం లేదు అని ఇష్టంతో మీరు నామం చేస్తూ ఉంటే అటువంటి భక్తి మీకు జ్ఞానమనే ఫలాన్ని ఇస్తుంది. మనం నోటితో భగవంతుడి నామాన్ని చెపుతాము కాని లోపల మన గుండె నమ్మదు. మాట, మనస్సు, దేహం ఇవి మూడు సమానంగా ఉండాలి. ఇవి మూడూ సమానంగా ఉంటే బుద్ధిలో ఉన్న వంకరలు పోతాయి. మనం చేసే సాధన అంతా మన అంతఃకరణాన్ని శుద్ధి చేసుకోవటానికే. అంతఃకరణం శుద్ధి అయితే అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి లేకుండా ఆత్మజ్ఞానం కలుగదు.

గాఢనిద్రలో ఎవరికి భయం లేదు. కాని జాగ్రదవస్థలో మనకు దేహం, లోకం కనిపించేటప్పటికి మనకంటే వాళ్లందరు వేరు అనే ద్వైతభావన వచ్చేటప్పటికి భయం కలుగుతోంది. దేహాన్ని, లోకాన్ని చూసేవాడు ఎవడూ భయంలో నుండి విడుదలపొందలేడు. టి.వి.లు, సినిమాలు ఇచ్చే ఆనందం, ఆత్మ ఇవ్వలేదేమో అనుకొంటున్నాము అందుచేత వాటి కూడా తిరుగుతున్నాము. ఆత్మానందం తెలిసాక తెలుస్తుంది దానికి మించిన ఆనందం ఇంకోటి లేదు అని మనకు తెలుస్తుంది. మనం వట్టిగడ్డి తినటానికి అలవాటుపడ్డాము అంటే టివిలు ఇచ్చే ఆనందం. వట్టిగడ్డికి అలవాటు పడ్డ దూడలు పక్కన పచ్చగడ్డి పెడితే దానికి అలవాటు లేకపోతే అది తినదు. మనం ఒకరోజు దాని నోట్లో పెట్టి అలవాటు చేసాము అనుకోండి ఇంక వట్టిగడ్డి తినటం పూర్తిగా మానేస్తుంది. అలాగే ఆత్మానందం రుచి చూసాక ఇంక వాడికి విషయానందం మీదకు వెళ్లదు. మనకు ఆత్మానందం రుచి చూపించేవాడే గురువు. నిరంతర కర్మయోగి మాత్రమే నిరంతర జాగరూకుడు. ఈశ్వరుడు నిరంతర కర్మయోగి. ఆయనకు పని చెయ్యవలసిన అవసరం లేకపోయినా పనిచేస్తున్నాడు. మనం అవసరం ఉండి కూడా పని

బద్ధకిస్తున్నాము. మనిషి తన బలహీనతల నుండి బయటకు రావటానికి ప్రయత్నం చేసేటప్పుడు ఎంతోకొంత బాధ ఉంటుంది, అది తట్టుకొంటే మీరు సక్సెస్ అవుతారు, నీ మనస్సును జాగ్రత్తగా వాచ్ చెయ్యి. ఏ బలహీనత వలన ఏ ఇంద్రియం ద్వారా మనస్సు బయటకు వెళుతోందో చూసుకొని ఆ విషయంలో నుండి మనస్సును బయటకు లాగి డైరెక్టుగా ఆత్మమీద నిలబెట్టు, అలా చేయలేకపోతే నీ ఇష్టదైవాన్ని ఆరాధించగా, ఆరాధించగా మీకు భగవంతుడితో అనుసంధానం వస్తుంది. మీకు భగవంతుడితో అనుబంధం వచ్చాక మీ మనస్సులో ఉన్న వాసనలు మీకు తెలియకుండా రాలిపోతాయి. నీకు పూర్వపుణ్యం లేకపోతే సజ్జనసాంగత్యం కనుక లేకపోతే మన మనస్సును ఈశ్వరుడితో అనుసంధానం చేయాలనే బుద్ధి మనకు రాదు.

శంకరాచార్యులవారు కాశీలో మణికర్ణికా ఘాట్‌లో స్నానం చేసివస్తున్నారు, పద్మపాదుడు స్నానానికి వెళుతున్నాడు, వారిద్దరు ఒకరినొకరు చూసుకొన్నారు, స్నేహం కలిగింది, ఆ స్నేహం చనిపోయేవరకు అలాగే ఉంది, అది జన్మాంతర అనుబంధం. ఇప్పడు శనివారం స్నేహాలు, ఆదివారం విరోధాలు. స్వార్థాన్ని కేంద్రంగా పెట్టుకొని స్నేహాలు చేస్తే ఆ స్నేహాలు ఎంతకాలం నిలబడతాయి. మన ఇంట్లో వారికి దేవుడిమీద నమ్మకం లేదు అనుకోండి. మన డ్యూటీ మనం చేయాలి కాని వారికి భక్తి లేదని మన భక్తిని పోగొట్టుకో కూడదు. నీకు భగవంతుడి మీద భక్తి ఉండాలి కాని కారణం కనబడకూడదు. కారణం కనిపిస్తే అది కారణభక్తి అవుతుంది, కారణభక్తి వలన కోరికలు నెరవేరతాయి కాని మోక్షం సున్న. ఈ లోకం ఎంత నిజమో, మీరు ఎంత నిజమో, నేను ఎంత నిజమో కోరికలు నెరవేరినా అంతే నిజం. నెరవేరిన కోరిక ఇంకో పది కోరికలను తీసుకొని వస్తుంది. ఒక కాకికి అన్నం పెడితే అది కావు కావు అని ఇంకో పది కాకులను పోగుచేసుకొని వస్తుంది. మనిషి అలాకాదు ఎవడికి పెట్టిన అన్నం వాడే తినేస్తాడు. భగవాన్ రంగన్‌తో ఏమన్నారు అంటే నువ్వు నా గురించి భగవాన్ అట్టివాడు, భగవాన్ ఇట్టివాడు, భగవాన్ జ్ఞాని అని చెపుతున్నావు, అటువంటి మాటలు చెప్పబోకు అన్నారు, నా గురించి యాగీ చెయ్యకు అన్నారు. అప్పడు రంగన్ కాకులు చేసే పని కూడా నేను చెయ్యలేనా అన్నాడు. నీ దగ్గర పొందిన శాంతిని మిగతావారు కూడా అనుభవిస్తారు అని వాళ్లను పిలుస్తున్నాను అని చెప్పాడు. బలహీనతలను చూసి కంగారు పడవద్దు. సాధన చేస్తే అవి పోతాయి. మీకు ఏ అలవాటు ఉందో, ఆ అలవాటు లేనివారితో స్నేహం చేస్తే వారి ప్రభావం మీ మీద పడుతుంది, నెమ్మదిగా ఆ అలవాటు పోతుంది. ఈశ్వర ప్రీత్యర్థం నీవు పనిచేస్తూ ఉంటే, దేవుని వాక్యాలను మాట్లాడటానికే నీ నోరును ఉపయోగిస్తూ ఉంటే, ఈశ్వరుడి దేవాలయాల చుట్టూ నీ కాళ్ళు తిప్పతూ ఉంటే, ఈశ్వరుడి యొక్క రూపాన్ని నీ నేత్రాలు అనుభవిస్తూ ఉంటే వీటివలన నీకు చిత్తశుద్ధి కలుగుతుంది, బాహ్యంగా ఏమీ లేదు అని నీకు తెలుస్తుంది, చిత్తశుద్ధి అనే గేటు

ద్వారానే మనిషి మోక్షాన్ని పొందాలి, ఇంకో దారి లేదు.

కళ్ళు, చెవులు, నోరు వీటివలననే మీరు పాడైపోతున్నారు అని గాంధీగారు చెప్పారు. పాడుదృశ్యాలను చూడటం, పాడు మాటలను వినటం, పాడు మాటలను మాట్లాడటం ఈ మూడు ఇంద్రియాల వలన మీరు పాడైపోతున్నారు అన్న సంగతి కనీసం మీకు తెలియటం లేదు. ఈ మూడు ఇంద్రియాలను కంట్రోలు చేసుకోలేనప్పుడు మీకు ఆత్మజ్ఞానం ఎలా కలుగుతుంది. ఎందుకు బుడబుక్కల మాటలు చెపుతారు, ఎవరిని మోసం చేస్తారు. అందుకే గాంధీగారు మూడుకోతుల బొమ్మలు తయారుచేసారు. నాకు గురువు ఈ మూడు కోతుల బొమ్మే అని చెప్పారు. ఉన్న వస్తువు ఒక్కటే అదే ఇన్ని రూపాలు ధరించింది. మీరు చేయగలిగితే నిరంతరం ఆత్మచింతన చేయటం లేకపోతే నిరంతరం మీ ఇష్ట దైవం యొక్క నామాన్ని స్మరించుకోవటం, ఆయన రూపాన్ని ధ్యానించుకోవటం. కర్మయోగం వలన చిత్తశుద్ధి వస్తుంది, భక్తియోగం వలన ఏకాగ్రత, పవిత్రత వస్తుంది. వీటివలన ముముక్షత్వం వస్తుంది. ఆ జిజ్ఞాస ఎప్పడైతే వచ్చిందో అప్పడు ఇది రాత్రి, ఇది పగలు అని తెలియకుండా జ్ఞానం కోసం కృషి చేస్తారు. ఆత్మజ్ఞానం వలన మోక్షం వస్తుంది. కృష్ణుడు అంటే ఆకర్షించేవాడు. గోపికలను కృష్ణుడి దగ్గరకు వెళ్ళవద్దు అని చెప్పేవారు, వెళితే మీ బట్టలు లాగేస్తాడు అనేవారు. కృష్ణుడు బట్టలు లాగేయటం అంటే మీ పునర్జన్మకు కారణమైన వాసనలను లాగేస్తాడు. మీరు ఆయన ఆకర్షణలో పడితే గత జన్మలనుండి వస్తున్న వాసనలు, ఆ పాపరాశి ఎంత ఉన్నా దానిని భస్మం చేసి ఆయన స్వరూపాన్ని ఇస్తాడు, వాడు దేవాది దేవుడు. మేము భగవంతుడిని ప్రార్థిస్తున్నాము. మరి కోరికలు నెరవేరటం లేదు ఎందుకు అని భగవాన్‌ను అడుగుతున్నారు. మీ కోరికలు నెరవేరకపోవటం మంచిదే. నెరవేరితే భగవంతుడిని ప్రార్థించటం మానివేస్తారు. ఎంత లేటుగా మీ కోరికలు నెరవేరితే అంతవరకు మీరు భగవంతుడిని ప్రార్థిస్తూ ఉంటారుకదా, అది మంచిది కంగారుపడకండి అని చెప్పారు. అమృతానుభవం ఎప్పడో పొందటం కాదు, ఇప్పడే పొందు, ఇక్కడే పొందు, ఈ శరీరం ఉండగానే అశరీరస్థితికి రా.

నీ హృదయంలోనే అమృతం ఉంది. నీకు లోచూపు కలిగితే, ఎక్కడైతే పరమాత్మ ఉన్నాడో అక్కడకు నీ మనస్సును ఉపసంహరించగలిగితే అమృతత్వాన్ని ఇక్కడే పొందుతావు. నువ్వు కామక్రోధముల యొక్క వేగం తగ్గించుకొంటే, అన్ని అభిమానాల నుండి విడుదల పొందితే నీ మనస్సు వెళ్ళి గూటిలో పడిపోతుంది, అప్పడుగాని నీకు ఆత్మజ్ఞానం కలుగదు. రాణి రాసమణిగారు రామకృష్ణపరమహంసకు ఉద్యోగం ఇచ్చారు. ఆవిడ పార్వతీ దేవి దగ్గరకు వచ్చి కోర్టులో తీర్పు తనకు అనుకూలంగా వచ్చేలా చేయమని మనస్సులో ప్రార్థించారు, అప్పడు రామకృష్ణపరమహంసగారు రాణిగారిని లాగి లెంపకాయ కొట్టారు, ఏమిటి నీకు పరమాత్మ

దగ్గరకు వచ్చి కోర్టు గొడవలా, అమ్మవారి దగ్గరకు వచ్చి జ్ఞానం అడగాలి కాని కోర్టు గొడవలా అన్నాడు. ఉద్యోగం పోతుందేమో అనే గొడవ ఆయనకు లేదు. అక్కడ ఉన్నవారు వీడి ఉద్యోగం తీసేయండి, ఆరు నెలలు జైలులో వేయండి అన్నారు. అప్పుడు రాణి రాసమణి ఏమని చెప్పారు అంటే ఆయన మహాభక్తుడు, ఆయనను ఉద్యోగంలో నుండి తియ్యవద్దు. నేను అమ్మవారిని ధ్యానం చేయటంలేదు, నా కోరికలను ధ్యానం చేస్తున్నాను, నేను చేసింది తప్పు, ఇంక ఆయనను ఉద్యోగంలో నుండి తీసేస్తే మహాతప్పు అవుతుంది అని చెప్పి రామకృష్ణపరమహంసగారి భక్తికి సంతోషించి అక్కడ నుండి వెళ్ళిపోయింది. రాణిగారు చాలా మంచిది అభిమానం లేకుండా సహనంగా వెళ్ళిపోయింది. ఏమీలేనివాడు అణిగి ఉండటం వేరు, రాణిగారికి అధికారం ఉన్నా అణిగి ఉండేవారు అందుచేత రామకృష్ణపరమహంస గారికి ఆవిడ మీద ప్రీతి. రామకృష్ణుడు ఎక్కువగా ఆవిడ వినయం గురించి మాట్లాడేవారు, ఆవిడ శరీరం పోయిన ఆవిడ నామం ఆయన నోట్లో నలిగింది. ఇంక ఆవిడకు మోక్షం రాకుండా ఎలా ఉంటుంది. సత్పురుషులను మనం స్మరించుకోవటం కాదు వారు ఒక్కసారి మనలను స్మరించుకొంటే చాలు మనకు మోక్షం వస్తుంది. సజ్జన సాంగత్యం యొక్క వైభవం అది. భక్తులకు నామమే సొమ్ము. మనం ఇంటి దగ్గర పైసాలు లేకపోతే దరిద్రులం అని అనుకోకూడదు. భగవంతుడి నామమే మనకు ఐశ్వర్యం, ఆయనే జ్ఞానదాత, మోక్షదాత. మనకు భక్తి లేకపోతే, భగవంతుడి పట్ల గౌరవం లేకపోతే, ఆయన నామాన్ని నోటినిండా పలకలేకపోతే దరిద్రులం. ఉద్దవుడు కృష్ణ భక్తుడు. నాకు అది కావాలి, నాకు ఇది కావాలి అని ఉద్దవుడు ఎప్పుడూ అడగలేదు. నాకు జ్ఞానం కావాలి అని అడిగేవాడు. అందుకు భగవంతుడు ఎప్పుడూ ఆయనను విడిచిపెట్టలేదు. కాని ఎప్పుడైనా నేను భక్తుడను అనే అహంకారం ఉద్దవుడికి వచ్చేది. వీడికంటే గోపికల భక్తి గొప్పది. ఉద్దవా! నేను గోపికలను చూసి చాలాకాలం అయింది, కృష్ణుడు మిమ్మల్ని చూసి రమ్మన్నాడు అని నాకోసం నీవు వెళ్ళి చూసిరా అని కృష్ణుడు చెప్పాడు. ఉద్దవుడు వెళ్ళి గోపికలను చూసాక వారి భక్తి ముందు నా భక్తి ఎందుకు పనికిరాదని తలవంచుకున్నాడు. ఆ భక్తిని నేర్పటానికే పరమాత్మ ఉద్దవుడిని గోపికల దగ్గరకు పంపాడు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 05-02-2008, తాడినాడ)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

భగవాన్ అందరినీ నిన్ను నీవు తెలుసుకో అంటున్నారు, మరి మేము ఎందుకు తెలుసుకోవాలి అని ఒక హేతువాది నన్ను అడిగారు. మీరు ఏమైనా డబ్బు సంపాదించుకొన్నారా అని నేను అడిగాను. సంపాదించుకొన్నాను అని చెప్పాడు. మీరు పెళ్ళి చేసుకొన్నారా అని అడిగితే చేసుకొన్నాను అని చెప్పాడు. ఏమైనా గౌరవం సంపాదించుకొన్నారా అని అడిగాను.